నమస్తే తెలంగాణ
వికారాబాద్

13 | హైదరాబాద్, గురువారం 7 మార్చి 2024 | VIKARABAD

ఇసుకే బంగారమాయే!

కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయాలు

- ఇతర జిల్లాల నుంచి ఇసుక తెచ్చి బ్లాక్ మార్కెట్‌లో విక్రయం
- టన్ను ఇసుక రూ.2,500 వరకు పలుకుతున్న ధర
- జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న కృత్రిమ ఇసుక తయారీ దందా
- సామాన్యులకు భారమవుతున్న సాంతింటి కల

రంగారెడ్డి, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇండ్ల నిర్మాణాల జోరు పెరిగింది. ఇదే క్రమంలో ఇసుక ధరలు సైతం అమాంతం పెరిగాయి. నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న ఇసుక ధరలు రెట్టింపై దొడ్డు ఇసుక రూ.2వేలు, సన్న ఇసుక రూ.2,500 వరకు ధర పలుకుతున్నది. కృత్రిమ కొరతను సృష్టించి వ్యాపారులు అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తుండగా.. కొంత మంది స్థానికంగానే కృత్రిమ ఇసుక తయారీకి తెర తీస్తున్నారు. ఇసుక ధరలకు రెక్కలు రావడంతో గృహ నిర్మాణ అంచనా వ్యయం మరింత పెరిగి.. బిల్డర్లు నిర్మాణాలను వాయిదా వేసుకునే ఆలోచన చేస్తున్నారు. పెరిగిన ఇసుక ధరలతో ఇక సామాన్యులకు సొంతింటి కల భారమవుతున్నది.

అనధికార కట్టడే కారణం..

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు పట్టణాల్లో సొంతింటి నిర్మాణాలు చేపడుతున్నాయి. మరో పక్క అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాల జోరు సైతం జిల్లాలో పెరిగింది. నిన్నమొన్నటి వరకు పుష్కలంగా ఉన్న ఇసుకకు నేడు కొరత ఏర్పడడంతోపాటు అమాంతం ధరలు పెరిగిపోవడానికి కొత్త ప్రభుత్వంలో ఇసుక రవాణా, తవ్వకాలపై కొనసాగుతున్న అనధికార నిషేధమే కారణమని తెలుస్తున్నది. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో కాళేశ్వరం, భద్రాచలం, కరీంనగర్, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను వ్యాపారులు రంగారెడ్డి జిల్లాకు తరలిస్తున్నారు. అక్కడ టన్నుకు రూ.450-500 వరకు చెల్లిస్తున్నారు. పెద్ద పెద్ద లారీల్లో 35 టన్నుల వరకు తరలిస్తున్నారు. రవాణా, ఇతర ఖర్చులు కలిపి వ్యాపారులకు మరో రూ.30వేలకు ఖర్చు వస్తున్నది. ఇసుకను ఇక్కడకు తరలించిన తర్వాత వ్యాపారులు ఇసుకును బ్లాక్ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం టన్ను సన్న ఇసుక ధర రూ.2,500 వరకు ఉండగా.. దొడ్డు ఇసుక ధర రూ.2వేల వరకు ఉన్నది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్, మైనింగ్, రవాణా శాఖల అధికారులను రంగంలోకి దింపి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నది. దీంతో ఇసుక రవాణా తగ్గడంతో లారీ యజమానులు, దళారులు ధరలు పెంచి ఇసుకను విక్రయిస్తున్నారు. నేటికీ ప్రభుత్వం ఇసుక పాలసీపై స్పష్టత ఇవ్వకపోవడంతో నిర్మాణాలు చేపడుతున్నవారికి ఇబ్బందులు తప్పడం లేదు.

కృత్రిమ ఇసుక దందా..

జిల్లాలో మాడ్గుల మండలంలో పలు వాగుల వద్ద ఇసుక దందా జోరుగా సాగుతున్నది. అలాగే.. ఇసుకకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో చాలా ప్రాంతాల్లో కృత్రిమ ఇసుక దందా సైతం గుట్టుగా సాగుతున్నది. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ.. పర్యావరణానికి విఘాతం కలిగించే కృత్రిమ ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఓ వైపు వాగుల్లోని ఇసుకను కొల్లగొట్టడమే కాకుండా గుట్టలు, పొలాల్లోని మట్టిని సైతం ఇసుకగా మార్చేస్తూ.. అక్రమ దందాను నడిపిస్తున్నారు. కృత్రిమ ఇసుకను గృహ నిర్మాణాల్లో వినియోగిస్తే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండి భవిష్యత్తులో యజమానులకు తీరని నష్టం వాటిల్లనున్నది. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో కొందరు వ్యక్తులు కృత్రిమ ఇసుకను తయారు చేసి ఆమనగల్లు, కడ్తాల్ తదితర ప్రాంతాలకు తరలిస్తుండగా.. ఇటీవల పోలీసులు ఇసుక డంప్‌ను సీజ్ చేసి టిప్పర్, జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనపర్చుకున్నారు. అడపాదడపగా కేసులు నమోదు చేస్తున్నప్పటికీ కృత్రిమ ఇసుక దందాకు మాత్రం పూర్తిస్థాయిలో చెక్ పడడం లేదు.

బాలల హక్కులను పరిరక్షించాలి

మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : బాలల హక్కులను అందరూ పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బాలల రక్షణకై అన్ని శాఖల సమన్వయం అవసరమని అన్నారు. బాలకార్మికులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, మిస్సింగ్ వంటి సమస్యలతో బాధపడే 18 సంవత్సరాల లోపు పిల్లలకు రక్షణ కల్పించడం కోసం అందరూ సహకరించాలని సూచించారు. చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బడీడు పిల్లలందరూ బడికి వెళ్లేలా చూడాలన్నారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ, దత్తత, పిల్లల లైంగిక నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణ తదితర అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి పద్మజా రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, పీడీ డీఆర్డీఏ శ్రీలత, డీపీవో సురేశ్‌మోహన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

- ఉచితంగా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజ్ చేయాల్సిందే..
- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం

మాటతప్పితే.. ఓటుతో బుద్ధి చెబుదాం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎల్ ఆర్ఎస్ మోసంపై నిరసనల హోరు

ఎన్నికలకు ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో మాజీ మంత్రి సబితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని నిలదీస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పత్రిక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దు, ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేతలు అధికారంలోకి వచ్చాక ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌తో లక్షల మందిపై భారం పడనున్నదని, ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేశారు.

- వికారాబాద్, మార్చి 6, (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్.. ఊసరవెల్లిలా రంగులు మార్చుతున్నది..

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్.. జిల్లాకేంద్రంలో హోరెత్తిన నిరసనలు

వికారాబాద్, మార్చి 6 : ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా.. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ పూటకో మాట మాట్లాడుతున్నదని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అందిస్తామని పార్టీ పెద్దలు గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్ఆర్ఎస్ విషయంపై నోరు మెదపకుండా డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల నుంచి రూ.20వేల కోట్ల వసూళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీతక్క, బట్టి విక్రమార్కలు ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు చెల్లించవద్దని ప్రజల కోసం పాటుపడుతున్నామని నమ్మించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ విషయంపై హైకోర్టులో కేసు వేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎల్ఆర్ఎస్ చెల్లింపులు లేకుండా ఉచితంగానే స్థలాల క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల నుంచి డబ్బుల వసూలు చేయడం సరికాదన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, నవీన్‌కుమార్, కృష్ణ, నాయకులు విజయ్‌కుమార్, రాంరెడ్డి, దేవదాసు, అశోక్, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేయాల్సిందే..

ప్లకార్డులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు

బడంగ్‌పేట, మార్చి 6 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉచితంగానే ఎల్ఆర్ఎస్ పథకం అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎల్ఆర్ఎస్ పథకం ఉచితంగా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎల్ఆర్ఎస్ బాధితులకు అండగా ఉంటామన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం గడువు మార్చి నెలాఖరుకు డెడ్‌లైన్ పెట్టడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని వాగ్దానాలు చేసిన నాయకులు ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుంటున్నదని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నోఎల్ఆర్ఎస్, నో బీఆర్ఎస్ అని పిలిచారని ఆమె గుర్తు చేశారు. ప్రజలు నేడు నో ఎల్ఆర్ఎస్ అంటే నో కాంగ్రెస్ అని నినదిస్తారని అన్నారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్నదన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీంకు ఎవరు డబ్బులు కట్టవద్దని ఇప్పుడున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచితంగా భూములను క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పి మాట మార్చుతున్నారన్నారు. ఎల్ఆర్ఎస్ మార్చి 31 కటాఫ్ తేదీ ప్రకటించడం సరికాదన్నారు. ప్రజలను దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ పెట్టారని ఆనాడు సీతక్క అనలేదా.. అని ప్రశ్నించారు. ప్రజల నుంచి ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.20వేల కోట్లు దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మంత్రి కోమటిరెడ్డి కోర్టులో వేసిన పిల్ ఏమైందని ఆమె ప్రశ్నించారు. ఈనెల చివరి తేదీలోగా ఎల్ఆర్ఎస్ డబ్బులు వసూలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టిన గడువును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 25 లక్షల కుటుంబాలపై భారం పడుతున్నదన్నారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, చైర్మన్లు, డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు స్వచ్ఛందంగా జనం పాల్గొన్నారు.

వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ శ్రేణులు

నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ అసాధ్యం

లక్షల్లో దరఖాస్తులు.. తక్కువ సిబ్బంది

ప్రక్రియ పూర్తికి 6 నుంచి 8 నెలల సమయం

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ అంశంలో అధికారుల్లో అయోమయం నెలకొన్నది. ముఖ్యంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన..క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది చాలా కీలకం. ప్రస్తుతం హెచ్ఎండీఏతో పాటు జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల్లో ఆ స్థాయిలో సిబ్బంది అందుబాటులో లేరని, అలాంటి పరిస్థితుల్లో లక్షలాది దరఖాస్తులను మార్చి 31 వరకు పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో ఉన్న అర్జీలను దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి.. ప్రాసీడింగ్స్ ఇవ్వాలంటే 6-8 నెలల కంటే ఎక్కువ సమయం పడుతుంది. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విషయంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సాధ్యాసాధ్యాలపై సమీక్ష చేయలేదు. పైగా మార్చి నెలాఖరులోగా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జారీ చేశారు. అప్పటి నుంచి పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్‌ప్లానింగ్) అధికారులు కసరత్తు మొదలు పెట్టినా.. నిర్ణీత గడువులోగా అసాధ్యమని పేర్కొంటున్నారు.

3.44 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..

7 జిల్లాల పరిధిలో విస్తరించిన ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో 47 మున్సిపాలిటీలను మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లోంచి వచ్చిన దరఖాస్తులే 3,44,726 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 50,025 అర్జీలను హెచ్ఎండీఏ అధికారులు జోన్ల వారీగా పరిశీలించారు.

హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు

జోన్స్	స్వీకరించిన దరఖాస్తులు	పరిశీలించినవి
శంకర్‌పల్లి	73915	12193
ఘట్‌కేసర్	159672	14872
మేడ్చల్	30850	10058
శంషాబాద్	80289	12902
మొత్తం	344726	50,025

మిగతా వాటిని పరిశీలన చేసి క్రమబద్ధీకరించే పనిని మొదలు పెట్టినా, ప్రస్తుతం ఉన్న సిబ్బందితో ఎంత వేగంగా చేసినా సాధ్యం కాదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 25 లక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సుమారు 25 లక్షల వరకు ఉన్నాయి. ఈ దరఖాస్తులను పూర్తిగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు అప్పగించకుండా శివారు ప్రాంతాల్లో ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 30 వరకు ఉన్న మున్సిపాలటీలకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ బాధ్యతలను అప్పగించారు. వీటి పరిధిలోనూ 2-3 లక్షలపైనే ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇలా అన్ని చోట్ల లక్షల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించడం, క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయడమంటే ఏవిధంగా చూసినా అసాధ్యమనే చెబుతున్నారు. పైగా పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో అధికారులు వాటి విధుల్లో ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో 'ఎల్ఆర్ఎస్' ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌తో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

మొయినాబాద్, మార్చి 6 : రైతు వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లతో అన్నదాతలకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ సిస్టమ్‌ను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు చేపడుతున్న నూతన ఆవిష్కరణలపై రైతులకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వం రైతు వేదికల్లో వీసీలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పర్యటనలో రైతులతో ముఖాముఖిగా సంభాషించడంతో పాటు నేరుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. నేటి ఆధునిక పోకడలకు అనుగుణంగా రైతులు వ్యవసాయ రంగంలో రాణించేందుకు ఇలాంటి కాన్ఫరెన్స్‌లు దోహదపడుతాయన్నారు. వ్యవసాయ నిపుణుల సూచనలతో సాగులో సులువు పద్ధతులను పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, మొయినాబాద్ క్లస్టర్ ఏఈవో సునీల్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్ ఏఈవో కుమార్ ఉన్నారు.

మొయినాబాద్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీసీ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి